భవనం శిథిలం.. రికార్డులెలా పదిలం !

- శిథిలావస్థలో ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- ఆదాయం వస్తున్నా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఏళ్ల నాటి రికార్డులకు భద్రత కరవు



ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రత్తిపాడు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్లక్ష్యం వెంటాడుతోంది. శతాబ్దం క్రితం నిర్మించిన ఈ భవనానికి మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. రికార్డులను భద్రపరచడానికి సిబ్బంది తంటాలు పడవలసి వస్తోంది. పైకప్పు పూర్తిగా శిథిలం కావడంతో చినుకు పడితే రికార్డులు తడిసిపోతున్నాయి. వాన నుంచి రక్షణ కోసం ప్లాస్టిక్ పేపర్‌తో కార్యాలయం అంతటినీ కప్పుతున్నారు. ఉన్నతాధికారులు కార్యాలయ తనిఖీకి వస్తున్నారు... వెళ్తున్నారు..కానీ నూతన భవన నిర్మాణం గురించి నోరుమెదపడం లేదు.

1892లో నిర్మాణం

ప్రత్తిపాడులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 1892లో (131 ఏళ్ల క్రితం) నిర్మించారు. ఒకదాని వెనుక ఒకటి ఉండేలా రెండు గదులు, ఒక హాలు నిర్మించారు. వెనుక గదిని రికార్డులను భద్రపరచేందుకు కేటాయించగా మరో గదిని సబ్ రిజిస్ట్రార్, సిబ్బందికి కేటాయించారు. కాలక్రమేణా భవనం శిథిలమవుతూ వచ్చింది. అధికారులు మాత్రం కార్యాలయం లోపలి భాగంలో టైల్స్ ఏర్పాటు చేసి, మరమ్మతులు చేశారు. భవనం వెలుపల మాత్రం మరమ్మతులకు పైసా విదల్చలేదు.

76 గ్రామాలకు...

ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో సుమారు 400 గ్రామ పంచాయతీలు ఉప్పటికీ 76 గ్రామాల్లోని భూములు, స్థలాలకే క్రయవిక్రయాలు జరుగుతాయి. దీని పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి ఏజెన్సీ మండలాలు కావడంతో భూముల క్రయవిక్రయాలు జరగవు. ఇక మిగిలిన ప్రత్తిపాడు మండలంలోని 44 గ్రామాలు, ఏలేశ్వరం మండలంలోని 11 గ్రామాలు, ఏలేశ్వరం నగర పాలక సంస్థ, శంఖవరం మండలంలోని కత్తిపూడి, రామన్నపాలెం, వజ్రకూటం, ఓంద్రేగుల, ఎరకాపురం, పిఠాపురం మండలంలోని వెల్దుర్తి, పి.దొంతమూరు, కిర్లంపూడి మండలంలోని కిర్లంపూడి, జగపతినగరం, సింహాద్రిపురం, రామకృష్ణాపురం, రాజుపాలెం, చిల్లంగి, గెద్దనాపల్లి, ముక్కొల్లు, వేలంక, గొల్లప్రోలు మండలంలోని చెందుర్తి, చిన జగ్గంపేట, కొడవలి, వన్నెపూడి వెరసి 76 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లోని ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లన్నీ ఇక్కడే జరుగుతాయి.

1862 నుంచి రికార్డులు

ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 1862 నుంచి రిజిస్ట్రేషన్లకు సంబంధిన విలువైన రికార్డులు ఉన్నాయి. వర్షం పడితే సరాసరి రికార్డులపైనే చినుకులు పడేవి. దీంతో కార్యాలయ సిబ్బంది ప్లాస్టిక్ కవర్లతో రక్షణ ఏర్పాటు చేశారు. అయినా పైకప్పు శిథిలమై లోపలికి వర్షం నీరు రావడంతో కార్యాలయం పైకప్పును ప్లాస్టిక్ కవర్‌తో కప్పి రక్షణ కల్పిస్తున్నారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. తరచూ పైన కప్పిన ప్లాస్టిక్ కవర్‌ను చింపి, చిందర వందర చేస్తున్నాయి. కోతులు పాడు చేసిన ప్రతిసారీ సిబ్బంది ప్లాస్టిక్ కవర్లతోనే కాపాడుతూ వస్తున్నారు. గతంలో వరద వచ్చిన సమయంలో తాండవ నది ఉగ్రరూపం దాల్చడంతో తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నీట మునిగి, రికార్డులన్నీ ధ్వంసమయ్యాయని, చినుకులకు ప్రత్తిపాడు రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు పాడవుతాయని దస్తావేజు లేఖర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ. కోట్లలో ఆదాయం

ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏటా రూ.కోట్లలో లావాదేవీలు జరుగుతాయి. గతేడాది రూ. 31 కోట్లు లక్ష్యం కాగా రూ.28 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రస్తుత ఏడాది రూ.42 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకూ క్రయవిక్రయాలు, స్టాంపు డ్యూటీల ద్వారా రూ.9 కోట్ల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

భవన నిర్మాణం చేపట్టాలి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం శిథిలస్థితికి చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో చెప్పలేం. దీనిలో విలువైన రికార్డులు ఉన్నాయి. వాటిని భద్రపరచడం కష్టతరం. తక్షణమే దీని స్థానంలో నూతనంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించాలి.

– చిలకమర్తి భాస్కరరావు, దస్తావేజు లేఖరి, ప్రత్తిపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం శిథిలమైంది. వర్షం నుంచి రికార్డులను ఎప్పటికప్పుడు కాపాడుకుంటున్నాం. ప్లాస్టిక్ పరదాలతో కప్పుతున్నప్పటికీ కోతులు తరచూ పాడు చేస్తున్నాయి. భవన నిర్మాణ ఆవశ్యకతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– టి.సుబ్బారెడ్డి, సబ్ రిజిస్ట్రార్, ప్రత్తిపాడు

క్లుప్తంగా

కళ్లకలక నివారణకు హోమియో మాత్రల పంపిణీ



తునిలో విద్యార్థులకు హోమియో మాత్రలు పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక గవరపేట మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో విద్యార్థులకు సోమవారం కళ్లకలక నివారణకు హోమియో మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులకు వాకర్స్ హెల్త్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు హోమియో మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లకలక వచ్చిన వారు, రానివారు కూడా ముందస్తు జాగ్రత్తగా ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై పట్టణ ప్రజలతో పాటు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ, క్లబ్ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ, కౌన్సిలర్ కన్నూరి మంగ, చోడిశెట్టి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సతీష్ కుమార్ కుటుంబానికి పరామర్శ



శృంగరాయునిపాలెంలో నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అనురాధ

కిర్లంపూడి: మండలంలోని శృంగరాయునిపాలెం గ్రామానికి చెందిన అడ్డాల సతీష్‌కుమార్ తండ్రి అడ్డాల నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బుడి ముత్యాలనాయుడి కుమార్తె, అనకాపల్లి జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ సోమవారం శృంగరాయునిపాలెంలో అడ్డాల సతీష్‌కుమార్ స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సతీష్ కుమార్ ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడి వద్ద పీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆమె వెంట ఓఎస్‌డీ పోలినాయుడు, పలువురు జెడ్పీటీసీలు, సర్పంచులు ఉన్నారు.

సొసైటీల్లో ఎరువులు సిద్ధం

గోకవరం: సొసైటీల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు సొసైటీకి వచ్చి తీసుకోవాలని గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు తెలిపారు. గోకవరం, తంటికొండ, రంపయర్రంపాలెం సొసైటీల్లో యూరియా, డీఏపీ, పోటాష్, జింకు, 20-20-0-13 రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెంలో సీలింగ్ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడుతూ గుర్రంపాలెంలో సీలింగ్ భూములను ఎన్నో ఏళ్లుగా వివిధ కులాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. వీరికి కాకుండా పట్టాలు వేరే వారికి ఇవ్వరాదన్నారు. ఈ భూమి విషయంలో నెలకొన్న గందరగోళ పరిస్థితులను విచారించి పేదలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు.

వైద్య విద్యను పేదలకు దూరం చేయవద్దు

తుని: వైద్య విద్యను పేదలకు దూరం చేయవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.రాము సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం రూ.వేల కోట్ల ప్రజాధనంతో ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల్లో సీట్లు అమ్ముకునేందుకు జీవోలు విడుదల చేయడాన్ని ఖండించారు. భవిష్యత్‌లో ఆదే విధానం అన్ని వైద్య కళాశాలలు అమలు చేస్తే పేదలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతుందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలపై పునరాలోచించి జారీ చేసిన ఉత్తర్వును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏలేరు జలాశయాన్ని సందర్శించిన టీడీపీ నేతలు

ఏలేశ్వరం: ఏలేరు జలాశయాన్ని సోమవారం టీడీపీ నాయకులు సందర్శించారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో జ్యోతుల నెహ్రూతో పాటు పలువురు పార్టీ నాయకులు జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు త్వరలో ఏలేరు జలాశయాన్ని సందర్శిస్తారన్నారు. దీనిలో భాగంగా జలాశయాన్ని సందర్శించినట్టు తెలిపారు. అనంతరం ఏలేరు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గ్యాస్ క్లోరినేషన్‌తో తాగునీటి శుద్ధి



గ్యాస్ క్లోరినేషన్ చేస్తున్న మున్సిపల్ కార్మికుడు

తుని: పట్టణ ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని మొట్టమొదటిసారిగా గ్యాస్ క్లోరినేషన్ ద్వారా శుద్ధి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు సోమవారం తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో మలినాలు ఉండడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నామని పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో మంత్రి దాడిశెట్టి రాజా, మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి ఆదేశాల మేరకు తాగునీటి శుద్ధికి అత్యాధునిక విధానాన్ని అవలంబిస్తున్నామని తెలిపారు. ఇకపై పట్టణ ప్రజలకు క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే అందిస్తామని చెప్పారు.

ఫైలేరియా రోగులకు ఆరోగ్య కిట్ల పంపిణీ



కిర్లంపూడిలో ఫైలేరియా రోగులకు ఆరోగ్య కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ తోట రవి

కిర్లంపూడి: కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీపీ తోట రవి అన్నారు. కిర్లంపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫైలేరియా వ్యాధి గ్రస్తులకు డాక్టర్ రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ తోట రవి, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి రోగులకు టబ్, మగ్గు, తువ్వాలు, సోపు, లేపనంతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబునాయక్ మాట్లాడుతూ దోమకాటుతో ఫైలేరియా వ్యాధి వస్తుందన్నారు. కాళ్లు, చేతుల వాపులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముత్త పెద్దకాపు, శరకణం సంతోష్, రాపేటి ప్రసాద్, దాడి పెద్దబుజ్జి, నైదాన రఘు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు శివారులో సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొర్రంపాలేనికి చెందిన గోడే లక్ష్మణ్ బైక్‌పై జగ్గంపేట నుంచి ఇంటికి వెళుతుండగా మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తలకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడికి సపర్యలు చేసి అతని బంధువులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని అతడిని ఆసుపత్రికి తరలించారు.

పాలవెల్లువ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



కోటనందూరులో పాలవెల్లువ మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ

కోటనందూరు: మండలంలో 11 జగనన్న పాలవెల్లువ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. ఈ కేంద్రాల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ సోమవారం ఆయా గ్రామాలకు చేరుకుంది. కోటనందూరు, కేఏ మల్లవరం, జగన్నాథపురం గ్రామాల్లో మెటీరియల్‌ను ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, పాతకొట్టాం, కొత్తకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాలకు వచ్చిన మెటీరియల్‌ను ఈఓపీఆర్డీ సుబ్రహ్మణ్యశర్మ పరిశీలించారు. జగనన్న పాలవెల్లువ కేంద్రాల ఏర్పాటుతో మహిళా రైతులు ఆర్థిక స్వావలంబన సాధిస్తారని అధికారులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రి రాజాను కలిసిన సీఐ రామకృష్ణ



మంత్రి దాడిశెట్టి రాజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ రామకృష్ణ

తుని: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణకు సూచించారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి రాజాను సీఐ రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల సీఐ రామకృష్ణ పశ్చిగోదావరి జిల్లా ఆకివీడు నుంచి బదిలీపై వచ్చి తుని పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి రాజా సూచించారు.

యువతకు క్రికెట్ కిట్ అందజేత

తుని మండలంలోని అగ్రహారానికి చెందిన యువతకు మంత్రి రాజా క్రికెట్ కిట్‌ను అందజేశారు. నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్, వాలీబాల్ టోర్నీలు నిర్వహిస్తున్నామన్నారు. యువత తమకు ఇష్టమైన క్రీడను ఎంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని సూచించారు.

రత్నగిరిపై చురుగ్గా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



రత్నగిరిపై సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అన్నవరం: స్థానిక రత్నగిరి వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో రూ.3.75 కోట్లతో నిర్మిస్తున్న 33 కేవీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆగస్టు 15 కల్లా ఈ సబ్‌స్టేషన్ నుంచి దేవస్థానానికి విద్యుత్ సరఫరా చేయాలని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) డైరెక్టర్ సూర్యప్రతాప్ ఇటీవల అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. కొండ దిగువన 33 కేవీ విద్యుత్ లైన్ నుంచి సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరాకు గాను 60 అడుగుల ఎత్తులో 12 టవర్ల నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు ట్రాన్స్‌కో విశ్రాంత డీఈ జి.రాంబాబు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కూడా పూర్తయిందని వివరించారు. దిగువ నుంచి కొండమీదకు టవర్స్ ద్వారా విద్యుత్ లైన్లు ఏర్పాటు పనులు రెండు, మూడు రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు.

నేడు అన్నవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

రత్నగిరిపై సబ్‌స్టేషన్ పనుల కారణంగా మంగళవారం అన్నవరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రత్నాలరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వై జంక్షన్ వద్ద గల ఎస్‌వీఆర్ సినిమా కాంప్లెక్స్ వరకూ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అధ్వానంగా రాజవరం–దిగువ శివాడ రహదారి



గోతులతో అధ్వానంగా ఉన్న రాజవరం-దిగువశివాడ రహదారి

రౌతులపూడి: మండలంలోని రాజవరం–దిగువశివాడ రహదారి ప్రమాదకరంగా మారింది. సుమారు మూడు కిలో మీటర్ల మేర రహదారి పూర్తిగా ఛిద్రమై అడుగడుగునా గోతులతో అధ్వానంగా తయారైంది. దీంతో ఈ రహదారి మీదుగా ప్రయాణించే ద్విచక్ర వాహన దారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో వెళితే ఆటోలు మరమ్మతులకు గురికావడంతో ఈ రహదారిలో ఆటోలు తిప్పడానికి ససేమిరా అంటున్నారు ఆటోడ్రైవర్లు. అసలే ఏలేరు ఎడమ కాలువ ఈ రహదారికి సమీపంలో ఉండడంతో రహదారిలో ప్రయాణించే వాహనాలు ఏ మాత్రం అదుపు తప్పినా నేరుగా ఏలేరు కాలువలో పడే ప్రమాదం ఉంది. సమస్యను పంచాయతీ రాజ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైస్తవులపై దాడులకు నిరసనగా శాంతి ర్యాలీ



ఏలేశ్వరంలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

ఏలేశ్వరం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా పట్టణంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక క్వారీ ప్రాంతం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించడం మానవ జాతికే చిగ్గుచేటన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలోనూ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది క్రైస్తవులు, మహిళలు పాల్గొన్నారు.

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

ప్రత్తిపాడు: విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆర్.విఠల్‌బాబును కిడ్నాప్ చేసి, అత్యంత పాశవికంగా హత్య చేసిన నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో సోమవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. నిందితులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అనంతరం న్యాయవాది విఠల్‌బాబు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కొద్దిసేపు మౌనం పాటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య, బార్ ప్రతినిధులు బొంగుకూరి మధుబాబు, గంగాధరరావు, శివకుమార్, ఎం.మంజూష తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- కత్తిపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



కత్తిపూడిలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: జనం మెచ్చిన పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలో కత్తిపూడిలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కరోనా కష్ట కాలంలోనూ రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ జలకళ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలు కావాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, సర్పంచ్ కొల్లు సత్తిబాబు, ఉప సర్పంచ్ గౌతు నాగు, కో ఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, ఎంపీటీసీలు చల్లా సత్యప్రసాద్, జీలకర్ర వీష్ణు, చోప్పా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పశువుల కాపరి మృతి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో పశువుల కాపరి మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం ... ప్రత్తిపాడు ఇందిరా కాలనీకి చెందిన తాతపూడి చంద్రరావు (60) స్థానిక రైతు కొమ్ముల గోపాలానికి చెందిన పశువులను మేపుతుంటాడు. ఎప్పటి మాదిరిగానే రైతు పొలంలోకి పశువులను తోలుకొని వెళుతూ స్థానిక అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన చంద్రరావును 108లో కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని శవ పరీక్ష కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మృతుని కుమారుడు తాతపూడి శేషయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్షలో 12,427 సర్టిఫికెట్ల జారీ

తుని రూరల్: మండల వ్యాప్తంగా జూలై ఒకటి నుంచి 28 వరకూ నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 12,427 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు (ధ్రువపత్రాలు) అందించినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని 27 సచివాలయాల్లోనూ జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మొత్తం 12,427 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 12,220 సర్టిఫికెట్లను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా లబ్ధిదారులకు అందజేశారన్నారు. మిగిలిన 207 సర్టిఫికెట్లను స్థానిక నాయకులు, అధికారులు లబ్ధిదారులకు అందజేశారని వివరించారు.

గిరిజన గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించాలి



శంఖవరంలో ర్యాలీ చేస్తున్న ఆదివాసీలు

శంఖవరం: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించాలని అఖిల భారత ఆదివాసీల సంఘం రాష్ట్ర కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శంఖవరంలో ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం మండలాలకు చెందిన ఆదివాసీలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ఆదివాసీలకు న్యాయం జరగడం లేదన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడడంలో పాత జిల్లాల్లో ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లాలోని ఆదివాసీలను అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇరట వీరబాబు, అడ్డాల వెంకట్రావు, మట్టమర్తి గణేష్, సాపిరెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాల సందర్శన



గండేపల్లిలో వరినాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గండేపల్లి: మండలంలోని మురారి, గండేపల్లి గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు వై.సునీత, వి.సుజాత తదితరులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ మండలంలోని వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఇప్పటికే 60 శాతం నాట్లు పూర్తయ్యాయని, ఈనెలాఖరుకు 100 శాతం పూర్తి అవుతాయన్నారు. కొన్ని చోట్ల ఆకుముడత తెగులు కనిపిస్తోందన్నారు. దాని నివారణకు లీటరు నీటిలో కార్బాఫ్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి పి.సదుర్గుమూర్తి, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

తొండంగి: వరి సాగులో తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మార్టేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండలంలోని ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం గ్రామాల్లో సోమవారం డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు, డాక్టర్ వై.సునీత, డాక్టర్ సుజాతలతో కూడిన సైంటిస్టుల బృందం పర్యటించింది. ఆయా గ్రామాల్లో వరి నాట్లతో పాటు వివిధ పంటలను పరిశీలించారు. వరి నారుమడులు ఆరోగ్యంగా ఉన్నాయని, ఎక్కడా చీడపీడలు కనిపించలేదన్నారు. రైతులు అవసరం మేర మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సుంకర బుల్లిబాబు, ఏఓ నరసింహం, రైతులు పాల్గొన్నారు.